ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి


పలమనేరు: ర్యాలీలో మున్సిపల్ అధికారులు


పుంగనూరు: జాతీయ పతాకంతో ర్యాలీ

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మంగళవారం ఆజీకా అమృత్ మహోత్సవ్–హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఇందులోభాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి పాల్గొని మాట్లాడారు. ఇంటింటిపై జాతీయ జెండాను ఎగరేయాలని కోరారు. పంద్రాగస్టు వేడుకలను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మాజీ సైనికోద్యోగులు, హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరేయాలని ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి అన్నారు. ఆయన మంగళవారం రొంపిచెర్లలో విద్యార్థులు, ఉద్యోగులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15ను ఒక పండుగలా చేసుకోవాలని తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసులు, ఏపీఎం హరినాథ, డీటీ వెంకటరమణారెడ్డి, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

పెద్దపంజాణి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరేసి దేశభక్తిని చాటాలని ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పుంగనూరు–పలమనేరు రహదారిపై స్వయం సహాయక సంఘసభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతలో జాతీయతను పెంపొందించే లక్ష్యంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్, హౌసింగ్ ఏఈలు శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎం క్రిష్ణప్ప, సీసీలు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: హర్ ఘర్ తిరంగాపై మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఐకేపీ కో–ఆర్డినేటర్ రవికుమార్ ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అలాగే బీజేపీ ముక్తిమోర్చ రాష్ట్ర కార్యదర్శి అయూబ్‌ఖాన్, నేతలు నరసింహులు, నాగరాజ ఆధ్వర్యంలో 100 అడుగుల జాతీయజెండాను విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అలాగే శుభారాం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాను పట్టుకుని మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. అలాగే కల్లూరు హైస్కూల్ హెచ్‌ఎం వెంకటసిద్దులు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు జెండా పట్టుకుని దేశభక్తి గేయాలు ఆలపించారు. సీడీపీఓ రాజేశ్వరి, ఏపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మువ్వన్నెల జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఎగరేయాలని తహసీల్దార్ మాధవరాజు, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి అన్నారు. బైరెడ్డిపల్లె ఇండియన్ బ్యాంక్ సమీపంలోని జాతీయ రహదారిపై స్వయం సహాయక సంఘాల సభ్యులు మానవహారం నిర్వహించారు. దేశభక్తిని చాటే నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం లలిత, వీఆర్ఓ రాజేష్, ఎంసీఓ సురేష్‌బాబు, సీసీలు వసంత, ఉమ, సంఘమిత్రలు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరేయాలని ఏపీఎం హరిప్రసాద్ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో స్వయం సహాయ సంఘ సభ్యులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సీసీలు రమేష్, భానుకుమార్, మధుసూదన్, రెడ్డి సుజాత పాల్గొన్నారు. బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తామని హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతిఒక్కరిలోనూ దేశభక్తి పెరగాలి

వి.కోట: ప్రతిఒక్కరిలోనూ దేశభక్తి పెరగాలని, ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరాలని బీజేపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎగువ చెక్‌పోస్ట్ నుంచి, దిగువ చెక్ పోస్టు వరకు మండల బీజేపీ నాయకులు జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

శాంతిపురంలో...

శాంతిపురం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగరేయాలని కోరుతూ బీజేపీ, జనసేన నాయకులు మండల కేంద్రంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, జనసేన నేతలు, ఔత్సాహికులు కిషోర్, కాశీవిశ్వనాథశాస్త్రి, గజేంద్ర, గోపి, హరికుమార్, గజేంద్ర, గోపి పాల్గొన్నారు.


శాంతిపురంలో మోటార్ సైకిళ్ల ర్యాలీ


రొంపిచెర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


సదుం: ర్యాలీలో సంఘ సభ్యులు



కల్లూరు: ర్యాలీలో విద్యార్థులు, పుంగనూరు: ర్యాలీలో సీడీపీఓ, ఐకేపీ మండల కోఆర్డినేటర్


పెద్దపంజాణి: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, అధికారులు


బైరెడ్డిపల్లెలో మానవహారం


వి.కోట: ర్యాలీలో నేతలు

క్లుప్తంగా

నేటితో సర్వే పూర్తి

పుంగనూరు: సుప్రీంకోర్టు, ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం సఫాయి కర్మచారి సర్వే కార్యక్రమం పూర్తిచేయనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో మాన్యువల్ లెట్రిన్ల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి వాటిపై చర్యలు తీసుకునేందుకు సేకరణ కార్యక్రమం వేగవంతం చేశామన్నారు. దీనికి సంబంధించి నేటితో గడువు ముగుస్తుందన్నారు. పట్టణ ప్రజలు త్వరితగతిన వీటి వివరాలను కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

రొంపిచెర్ల తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్

రొంపిచెర్ల: రొంపిచెర్ల తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు అనమయ్య జిల్లా కేవీపల్లి మండలం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కిరణ్ కుమార్‌ను రొంపిచెర్లకు బదిలీ చేశారు. రొంపిచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఆయన్ను డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించి తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన


శస్త్ర చికిత్సకు ఎంపికైన బాధితులు

బైరెడ్డిపల్లె: తీర్థం ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం కోలార్ జాలప్ప మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 55 మందికి కంటి పరీక్షలు చేసి 15 మందికి శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించారు. వైద్యాధికారులు అరుణ్‌కుమార్, పద్మావతి, జాలప్పా మెడికల్ కాలేజ్ వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ఎంపీహెచ్ఏ శ్రీదేవి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు నివాళి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

బైరెడ్డిపల్లె: మండలంలోని గొల్లచీమనపల్లెకు చెందిన ఆర్మీ జవాన్ నవీన్‌కుమార్ గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. స్వగ్రామానికి చేరుకున్న నవీన్‌కుమార్ మృతదేహం మంగళవారం చేరుకోవడంతో ఆ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. దేశానికి సేవ చేయడంతో పాటు గ్రామంలో కూడా మంచి పేరు నవీన్‌కుమార్ తెచ్చుకున్నాడని గ్రామస్తులు కొనియాడారు. తహసీల్దార్ మాధవరాజు, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి అక్కడికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

పురవీధుల్లో ఉత్సవ మూర్తుల ఊరేగింపు


ఉత్సవ మూర్తుల విహారం

గుడుపల్లె: శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. గుడుపల్లెలో ప్రసన్న శ్రీదేవి భూదేవి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. వేంకటేశ్వరస్వామిని పల్లకీసేవలో గ్రామంలోని పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు కర్పూర హారతులు ఇచ్చి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

సచివాలయానికి తాళం!



వి.కోట: తన భూమిలో నిర్మించిన సచివాలయాన్ని ఖాళీ చేయాలని ఓ వ్యక్తి సచివాలయానికి తాళం వేసిన సంఘటన మంగళవారం మండలంలోని జవునిపల్లె సచివాలయం వద్ద చోటుచేసుకుంది. వివరాలు..గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం గ్రామానికి చెందిన సోమశేఖర్ వ్యక్తి వద్ద డీకేటీ స్థలాన్ని తీసుకుని సచివాలయ భవనాన్ని నిర్మించింది. ఇక్కడే ప్రజలకు సేవలు అందించింది. అయితే ఆ భూ యజమాని మంగళవారం సచివాలయానికి తాళం వేసి తమ స్థలాన్ని ఖాళీ చేయాలంటూ డిమాండ్ చేశారు. ఒకసారి ప్రభుత్వానికి ఇచ్చిన, కేటాయించిన భూమిని భూయాజమానులు ఈవిధంగా సచివాలయానికి తాళం వేసి ప్రజల సేవలను నిలిపి వేయడం ఏమిటంటూ ఇది సబబు కాదని ప్రజలు, అధికారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించడానికి కృషిచేస్తున్నారు.

పుంగనూరు క్రిమినల్ కోర్టు న్యాయమూర్తిగా కృష్ణవంశి

పుంగనూరు: పుంగనూరు క్రిమినల్ కోర్టు న్యాయమూర్తిగా కె.కృష్ణవంశిని నియమిస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న కృష్ణవంశి పుంగనూరు న్యాయమూర్తిగా పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే చిత్తూరు క్రిమినల్ కోర్టుకు కూడా అదనపు విధులు నిర్వర్తించాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా ఇక్కడ పనిచేస్తున్న న్యాయమూర్తి సింధు బదిలీపై వెళ్లారు.

ఎక్స్‌రేకు బయటకు పోవాల్సిందే!


సీహెచ్‌సీ ఆస్పత్రి

సదుం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో కొన్ని నెలలుగా ఎక్స్‌రే ఫిల్ముల కొరత కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్స్‌రేను బయటకెళ్లి ప్రైవేట్‌లో తీసుకురావాలని సిబ్బంది సూచిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇక్కడ సౌకర్యం లేక పీలేరుకు వ్యయప్రయాసల కోర్చి వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 పడకల ఆస్పత్రిగా మారినా ఫిల్ముల కొరత ఏర్పడడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పకుమారిని వివరణ కోరగా ఫిల్ముల కోసం నివేదిక పంపామని, త్వరలోనే వస్తుందని చెప్పారు. ఎమర్జెన్సీ కేసులకు ఎక్స్‌రే ఆస్పత్రిలోనే తీస్తున్నామని తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు: మున్సిపాలిటీలో స్టాండింగ్ కౌన్సిల్ పదవికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన ఈ మేరకు లేఖను న్యాయవాదుల సంఘానికి పంపారు. మూడేళ్ల కాలపరిమితి కలిగిన స్టాండింగ్ కౌన్సిల్ ఉద్యోగానికి ఏడేళ్ల అర్హత కలిగిన న్యాయవాదుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అర్హత కలిగిన న్యాయవాదులు ఏడు రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎగ్జిబిషన్ వర్షార్పణం



నీట మునిగిన ఎగ్జిబిషన్ ప్రాంతం, వలసదారులు

పుంగనూరు: వర్షాలకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద వర్షపు నీరు అధికంగా రావడంతో ఎగ్జిబిషన్ వర్షపు నీటిలో మునిగిపోయింది. ఆది, సోమవారాల్లో కురిసిన వర్షానికి నీరు నిల్వ చేరడంతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతం జలమయమైంది. మహారాష్ట్రకు చెందిన 30 కుటుంబాలు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తూ సంచార జీవనం సాగిస్తున్నారు. ఇందులోభాగంగా గతవారం పుంగనూరుకు చేరుకుని ఎగ్జిబిషన్ ఏర్పాట్లు చురుగ్గా చేపట్టారు. వర్షం కారణంగా ఎగ్జిబిషన్ పనులు అర్ధంతరంగా ఆగిపోయి నీట మునిగిపోవడంతో రూ.6 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు వారు వాపోయారు. రెక్కాడితేకానీ డొక్కాడని వలసదారులు వర్షం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

గ్రామీణులకు వైద్య సేవలు


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మురళి

పెద్దపంజాణి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి అన్నారు. మంగళవారం రాజుపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. 104 వాహనంలో వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ గంగాభవాని, ఏఎన్ఎం క్రిష్ణవేణి, ఆశావర్కర్లు ప్రభావతి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ఇన్‌శానిటరీ లెట్రిన్స్‌పై సర్వే

పలమనేరు: మండలంలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్‌శానిటరీ లెట్రిన్స్‌పై సర్వే జరుగుతోందని స్థానిక ఈఓఆర్డీ బాలరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను నేడు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

రక్తపరీక్షలు కచ్చితంగా చేయాలి

గుడిపాల: జ్వరంతో వచ్చిన రోగులకు కచ్చితంగా రక్తపరీక్షలు చేయాలని డీఎంహెచ్ఓ ప్రభావతి తెలిపారు. మంగళవారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఓపీలో వచ్చే పేషెంట్లకు అన్ని విధాలుగా సౌకర్యాలు ఉండే విధంగా చూడాలన్నారు. రక్తపరీక్షలు చేసే గదిని పరిశీలించారు. అనంతరం పాపసముద్రం గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. గ్రామాల్లో వైద్యసేవలు ఎలా అందిస్తున్నారని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సంధ్య, చంద్రమహేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జరభద్రం

- దోమల వ్యాప్తితో సీజనల్ వ్యాధులు
- కలుషిత ఆహారంతో అతిసారం
- జాగ్రత్తలు పాటించాలంటున్న డాక్టర్లు


సదుం: హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

సదుం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రస్తుతం గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణంలో మార్పులు, నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందుతాయి. వీటి కాటు వల్ల పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడే అవకాశం తప్పుతుందని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఇళ్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలుపుతున్నారు.

వ్యాధులు పెరిగే అవకాశం:

కొద్ది రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. వర్షపు నీరు అక్కడక్కడ నిలిచి దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఫలితంగా ప్రజలు జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు. వాతావరణ మార్పులతో జలుబు, జ్వరం, దగ్గుతో పాటు మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యా సోకే అవకాశం ఉంది. కలుషిత ఆహారం తీసుకోవడంతో అతిసారం ప్రబలుతుంది. వీటికి సంబంధించిన లక్షణాలు కనబడితే స్థానిక ప్ర భుత్వ ఆస్పత్రుల్లో వెంటనే చికిత్స తీసుకోవాలని వైద్యులు కోరుతున్నారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చికిత్స విషయంలో నిర్లక్ష్యం తగదని చెపుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. మల, మూత్ర విసర్జన అనంతరం చేతులను శుభ్రం చేసుకోవాలి
- ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలి. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి.
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తరువాతే వినియోగించాలి.
- ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, డ్రమ్ములు ఉంచరాదు. వీటి ద్వారా దోమలు వృద్ధి చెందుతాయి.
- పేడ దిబ్బలు సమీపంలో లేకుండా చూడాలి.
- వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకోవాలి
- దోమలు ప్రవేశించకుండా కిటికీలు, తలుపులను సాయంత్రం వేళలో మూసి ఉంచాలి. నిద్రించే సమయంలో దోమతెరలు వాడాలి.
- బయట చేసిన, నిల్వ ఉంచిన, అపరిశుభ్రమైన ఆహార పదార్థాలను తీసుకోరాదు.

జాగ్రత్తలు పాటించాలి



కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆరోగ్య సిబ్బంది వ్యాధులపై గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు చికిత్స చేయించుకోవాలి. చికిత్స చేయించుకోవడంలో అశ్రద్ధ వహించరాదు.

– డాక్టర్ గిరీషా, చెరుకువారిపల్లె పీహెచ్‌సీ

శ్రీవారి నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ


కూరగాయల లారీతో జెడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులు, జెడ్పీటీసీ శ్రీనివాసులు

శాంతిపురం: తిరుమల శ్రీవారి నిత్యాన్నదానానికి మిత్రుల సహకారంతో 9 టన్నుల కూరగాయలను జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు మంగళవారం పంపారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గోవిందప్ప చేతులమీదుగా కూతేగానిపల్లి వద్ద టీటీడీ లారీకి పూజలు నిర్వహించారు. జజెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామిపై భక్తితో నిత్యాన్నదానం కోసం ఏటా పలుమార్లు కూరగాయలు పంపుతున్న శ్రీనివాసులును అభినందించారు. కరోనా సమయంలో కూడా మండలంలో ఇంటింటికీ ఉచితంగా కూరగాయలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. పగడాల సురేష్, లోకనాథరెడ్డి, హరి, అశోక్, త్యాగరాజు, రమేష్ రెడ్డి, సుధా పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- అగ్రహారంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు
- దోమల బెడదతో జ్వరాల విజృంభణ
- పట్టించుకోని అధికారులు


అగ్రహారంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ ఎస్.అగ్రహారంలో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో 70 కుటుంబాలు ఉన్నాయి. మురుగు నీటి కాలువలను శుభ్రపరచకపోవడంతో నీరంతా రోడ్లపై పిల్ల కాలువలా ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. దోమలకు ఆ ప్రాంతాలు ఆవాసమయ్యాయి. పారిశుధ్యం లోపించడంతోపాటు తాగునీటి కలుషితమవుతోంది. వర్షం వస్తే చాలు పాఠశాలకు సమీపంలో రోడ్డుపై చిన్నపాటి మడుగులను తలపించేలా వర్షపు నీరు నిల్వ ఉంటోంది. ఇక్కడి సమస్యలను అధికారులకు నివేదించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగు పరచి, గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసిన యూటీఎఫ్, ఎస్టీయూ సంఘ నేతలు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఈ మేరకు టీచర్ల డిమాండ్లను పరిష్కరించాలంటూ మంగళవారం యూటీఎఫ్, ఎస్టీయూ సంఘ నేతలు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీని కలసి వినతిపత్రాలు అందజేశారు. టీచర్ల డిమాండ్ల పరిష్కారం కోసం డీఈఓ దేవరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జీవీ రమణ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా జిల్లా పరిషత్ పీఎఫ్ అసంబద్ధంగా నిర్వహిస్తున్నారు. పీఎఫ్ వివరాలను క్రమబద్ధీకరించి చందాదారులకు నెలవారి జమలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల స్థలాలు అన్యాక్రాంతానికి లోనుకాకుండా సర్వే చేయించి హద్దులు గుర్తించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలకు మోక్షం కల్పిస్తాం..

పీఎఫ్ సమస్యలకు మోక్షం కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ తెలిపారు. ఎస్టీయూ సంఘ నాయకులు మంగళవారం కలెక్టర్‌ను కలసి పలు అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ టీచర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ జాబితాల తయారీకి విద్యాశాఖలో ఉన్న సిబ్బందితో పాటు కంప్యూటర్‌పై పట్టు ఉన్న కొద్ది మంది టీచర్ల సహకారం తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారన్నారు. రివర్షన్ కోరుకుంటున్న టీచర్లకు ఖచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, నేతలు పురుషోత్తం, దేవరాజులురెడ్డి పాల్గొన్నారు.